# పుత్రోత్సాహం

అప్పుడే తొమ్మిది గంటలు కావస్తోంది. ఇంకా సరిదిద్దవలసిన యింటి పనులు యెన్నో వున్నాయి. పిల్లలు బడికి వెళ్లి అయన గారు ఆఫీసుకు వెళ్ళిపోతే తప్ప తాను 'ఫ్రీ బర్డ్' కాదు. ఈ విషయం దమయంతికి బాగా తెలుసు. మళ్లీ సాయంకాలం నాలుగున్నర వరకు తన యిష్టం. తాను యేం చేసినా, యేమీ చేయకపోయినా అడిగేవారు వుండరు. ఎవరికీ సమయం లెక్క చెప్పవలసిన బాధ్యత లేదు.

హాయిగా నిద్రపోవచ్చును. ఏమయినా చదువుకుంటూ కాలం గడిపివేయ వచ్చును. బుద్ధి కుదిరి బల్ల దగ్గర కూర్చొగలిగితే ఓ కథో, నవలలో భాగమో... కనీసం వచన కవిత్వం బిట్ గానీ వ్రాసి పడేయువచ్చును. అంతా తన యిష్టం. ఎక్కువ సేపు చదవడం అంటే దమయంతికి విసుగు. తాను పుస్తకాలు వ్రాయటానికే గాని, చదవడానికి పుట్టలేదని ఆమె గాఢ విశ్వాసం.

పుస్తకాలు చదవడంలో మరో ప్రమాదం వుంది. తప్పని సరిగా ఆ అభిప్రా యాలు తన రచనలలో ప్రతిరూపం ధరిస్తాయి; ఎవరయినా పోలికలు పసికట్టి పగడ లేవదీస్తే లేనిపోని యిబ్బంది.

కాని బొత్తిగా చదవకపోతే తోటివాళ్ళు — సమకాలిక — రచయితలు — రచయిత్రులు యేం వ్రాసి పడేస్తున్నారో తెలియకుండా పోతుంది. 'సామా జిక స్పృహ' కావాలనుకున్నప్పుడు యెరిగీ యెరగకుండానే పక్కవాళ్లు యేం చేస్తున్నారో తెలుసుకోవడం తప్పనిసరి.

దమయంతి కాలేజీ రోజుల నుంచి అలవాటు చేసుకుంది — సమాజానికి అవసరం అయిన రచనలు చేయడం. సమాజం యేమయిపోతే నాకేం అన్న ఉదాసీనత ఆమెకు చేతకాదు.

చుట్టూవున్న మనుషులందరూ తన కథలలో నవలల్లో చోటుచేసుకోక పోవ చ్చును. కాని అలాంటి మనుషులు, అవే సన్నివేశాలు జీవితంలో అనుదినం

తటస్థ పడడం తప్పనిసరి.

దమయంతి చాలా రచనలు చేసింది. రచనలకు పరమార్థం ప్రచురణ — పత్రికలలో — అవడం. ఈ అంతస్తూ సాధించింది ఆమె. తరువాత మెట్టు తన రచనలు యితరులు చదివి మెచ్చుకోవడం, తనను రచయిత్రిగా అందరూ 'గుర్తించడం.'

మెచ్చుకోవడం మాట ఎలావున్నా, తన రచనలు యెవరూ చదువుతునట్లే అనుమానంగానయినా తోచలేదు, ఆమెకు. ఫలానా కథ బాగుంది; ఫలానా రచన మీ (మా) పత్రికకు 'హైలైట్' వంటి ఉత్తరాలు ఎప్పుడూ ఆమె రచనలను పురస్కరించుకుని పత్రికలలో ప్రచురణ కాలేదు. చదువరులు తన రచనలపట్ల అతి ఉదాసీనంగా వున్నారు. కాని ఎప్పటికైనా వాళ్ళు 'అంతకు అంత' వడ్డీ కట్టి, తనను — తన రచన వ్యాసంగాన్ని — తీవ్రమైన అంకిత భావాన్ని గుర్తించి తీరవలసిందేనని దమయంతి హృదయపూర్వకంగా నమ్ముతోంది.

రెండోమాటు చదవ వలసిన అవసరం వున్న రచనలు ఆమె ఎప్పుడూ చేయలేదు. వ్రాసిన తరువాత తిరిగి చదవడం అంటేనే బద్ధకం. ఎందుకు ఆ శ్రమ? ఆ మాత్రం తీరుబడి వుంటే మరో కథో, గేయమో వ్రాసుకో వచ్చు గద. దీపం వుండగానే యిల్లు చక్కబెట్టుకోమన్నారు. అందుకని చెయ్యి - కాలు సరీగా వున్నప్పుడే వ్రాయగలిగిన వన్నీ వ్రాస్తే ఆ తరువాత చూచుకోవచ్చును. మెదడుకేం - అదెప్పుడూ వదిలంగానే వుంటుంది. అది కాస్తా పని చేయడం ఆపేస్తే అప్పుడు ఆలోచించవలసిన, ఎదురు చూడవలసిన అవసరమే వుండదు గద!

అర్జెంట్‌గా ఒక కథ వ్రాయవలసిన అవసరం వచ్చింది దమయంతికి ఆరోజు. ఎలాగయినా ఆ పగలు, రాత్రి శ్రమ అనుకోకుండా ఓ కథ వ్రాసి పడేస్తే రేపు వచ్చే పత్రిక స్పెషల్ ఇష్యూలో తన కథ లేదనే లోపం మళ్లీ సంవత్సరం వరకూ తనను బాధించకుండా వుంటుంది.

పోస్ట్ వాళ్లకు కొంత సమయం కావాలి — తను కవరును అవతలి వూళ్లో వున్న పత్రిక యాజమాన్యానికి అందించటానికి. ఈ సమయాన్ని మినహాయించుకుని చూస్తే తాను కనీసం రేపు ఉదయం పది గంటల లోపుగా పోస్ట్ డబ్బాలో 'కథ' పడవేయవలసిందే. ఈక్షణంలో తన బల్లమీద, మెదడులోను యేమీ కథ లేకపోవచ్చును గాక. రేపు మాత్రం యిదే సమయానికి తప్పని సరిగా పోస్ట్ డబ్బాలో పడి తీరుతుంది. తరువాత తీరుబడిగా పత్రికలోనూ పడుతుంది. తాను పడిన శ్రమ అంతా ఫలిస్తుంది. చదువరులు చదువుతో దలుచుకుంటే ఓ మంచికథ ప్రపంచంలో వుండి తీరుతుంది.

దమయంతి యిలా అని సంకల్పం చేసేసుకుంది.

ఇప్పుడు వచ్చిన యిబ్బంది యేమీ లేదు. కాస్త – పది గంటలు అయిన తరువాత లైబ్రరీకి వెళ్లి ఓ గంట, రెండు గంటలు కూర్చుంటే కథకు యేదో ఒక 'ప్లాట్' దొరక్కపోదు. కథల పుస్తకాలలోనుంచి కావచ్చును, లేదా యెవరయినా 'యింటరెస్టింగ్ పెర్సన్' అక్కడే కనిపించ వచ్చును. అతడు తొడుక్కున్న చొక్కా మౌర్యుల కాలందీ, లాగు గుప్తుల కాలందీ అవుతే అంతకన్న యింకేం 'సబ్జెక్ట్' కావాలి? లాల్చీవేసుకుని 'పాంట్' ధరిస్తున్న ఆసామీలు చాల మంది కనిపిస్తున్నారు ఈ మధ్య. 'టి' షర్ట్‌కు కాలర్ వుండవచ్చును, లేక పోవచ్చును. దానికి ఎదుర్రొమ్ము మీద – కాకపోతే వీపున ఓ పెద్ద 'స్లోగన్' కొట్టవచ్చే రంగులో అద్దు వేసి వుంటుంది; 'పొగ తాగకండి;' 'పిల్లల్ని కనకండి'; 'ప్రేమను పెంచండి'; 'ఈ రాజ్యంనాదే'; 'అన్ని భాషలూ నేనే' – యిలా ఎన్నో నినాదాలు, చొక్కాల మీద, బనియన్ల మీద వేసుకుని ఇవి యింకా హృదయంలోనికి చొచ్చుకు - చీల్చుకు పోకుండా బాధలు పడుతున్న అనేక మంది యువతీ యువకులు, మధ్య వయస్కులు, వయోధికులు కనిపిస్తారు – రోడ్డు మీదకు వెళ్ళగలిగితే చాలు.

ఇంట్లో కూర్చుని కళ్లు మూసుకుని 'విజులైజ్' చేయడం కంటె అలా రోడ్డు పట్టి పైకివెళ్ళి సమాజంలో సజీవంగా మెదులుతున్న మనుషుల మస్తిష్కాలను, మరుపురాని రూపు వికారాలను గమనించడం శ్రేయస్కరం అయిన సంగతి.

దమయంతి తాను ఫ్రీ బర్డ్ అయిన క్షణం యిల్లు తాళం వేసుకుని బయలు దేరింది. 'సాయంత్రానికి ఓ కొత్త సర్‌ప్రయిజ్ యిస్తాను' అని చెప్పింది భర్త వెళ్లబోయే ముందు. 'కథయితే తప్పకుండా వింటాను; కవిత్వం మాత్రం నా వల్లకాదు –' అన్నాడు అతను, యీ ధోరణి అలవాటు అయినదే గనుక.

'కథే. కథే. ముమ్మాటికీ కథే.'

'అయితే మూడు కథలు వ్రాసి పడేస్తావా యేమిటి?'

'వ్రాయాలనే వుంది. కాని రోజుకు ఒకటి వ్రాయగలిగితే అదృష్టవంతురాలిని' - నిట్టూరుస్తున్నట్లుగా అన్నది.

'బెస్ట్ ఆఫ్ లక్' అని ఆ పురుష పుంగవుడు స్కూటర్ ముందుకు దూకిం చేశాడు.

అతడు వెళ్లిపోయిన తరువాత గుర్తు వచ్చింది, దమయంతికి - తాను కూడా అతనితో బయలుదేరి లైబ్రరీ ముందు డ్రాప్ అయిపోతే ఓ పది రూపాయలు

కర్చు కలిసి వచ్చేది గదా - అని. ఏమో, లైబ్రరీకి వెళ్లే దారిలోనే - నడుచు కుంటూనో, బస్‌లోనో, ఆటోలోనో వెడుతూ వుండగానే - తనకు ప్లాట్ దొరకవచ్చును గదూ.

అంతా మన మంచికే అనుకోవడంలో ఎంతో ఊరట, తృప్తి, సమాధానం వున్నాయి. ఎవరి పనులు వాళ్లు చేసుకోవడంలోనే ఆనందం; పరాధీనత పరా శ్రయం పనికిరాదు. నా కథ నేనే వ్రాసుకున్నట్లు, కథకు ప్లాట్ వెదకడంలోనూ నేనే శ్రమ పడతాను. ఆయన మీద ఆధార పడడం ఎందుకు? - అనుకుంది.

తక్షణం బయలు దేరింది.

నిన్న - ఆకాశమంతా నక్షత్రాలు పరుచుకున్న రాత్రి - వాన కురిసి వెలి సింది. రోడ్డు మీది దుమ్ము యింకా తడిగా వున్నది.

ఇదే బీచిలో చూస్తే యిసుక మీద రాసిన రాతలు పూర్తిగా చెరిగి పోవడం కనిపించి వుండేదనిపించింది, దమయంతికి. సముద్ర కెరటాల తాకిడికి రాతి బండల మీద రచనలు కూడా రద్దు రద్దయి పోతాయి. ఇంక యిసుక మీద గీతలు యేపాటి?

మందంగా వీస్తున్న గాలులు యిప్పుడిప్పుడే వెచ్చదనాన్ని సంతరించుకుంటు న్నాయి. ఆ వేడి మరింత అయి పోయి, శరీరం దీన్ని తట్టుకోవడం అసాధ్యం అనిపించే సమయానికి తాను యింటికి చేరుకోగలిగితే, అప్పుడు తీరుబడిగా కూర్చుని కథ వ్రాసుకోవచ్చును. అంతకు ముందు సంపాదించుకున్న 'ప్లాట్' కరిగి పోకముందే; మనసులో పొరలు యింకా మరుగు పడిపోకముందే.

దమయంతి లైబ్రరీలో అడుగు పెడుతూ వుండగా అప్పుడే ఆ హాలంతా కలయ తిరిగేసి బయటకు వెళ్ళిపోదామని నిశ్చయం చేసుకున్న కరుణాకరం కనిపించాడు.

కరుణాకరం నమస్కారం చేశాడు. దమయంతి నిలుచున్న చోటనే ఆగిపో వలసి వచ్చింది. ఆ నమస్కారం బాణం తాకిడి అలాంటిది.

'బాగున్నారా? చాల కాలం అయింది మిమ్మల్ని చూచి -' అన్నాడు లో గొంతులో - పెద్దగా మాట్లాడడం యిక్కడి నిబంధనలకు వ్యతిరేకం అన్న విషయం బాగా గుర్తు వుండడం వల్ల.

'ఆహా! బాగుండడం తప్ప యింకేం చాతకాదు గదా నాకు,' అంది దమ యంతి తానూ అదే లోగొంతుతో.

'ఇప్పటి నుంచే లైబ్రరీలో కూర్చుని జడపదార్థాల వంటి ఆ కాగితాలు,

పుస్తకాలు యేం చూస్తూ వుంటారు? కాస్త, నా మాట కాదనక, బయటకు వెడదాం రండి. ఎదురుగా రెస్టారెంట్‌లో రెండు గుక్కలు వేడి వేడి అమృతం తాగి ఆ తరువాత క్షేమ సమాచారాలు చెప్పుకుందాం' అన్నాడు అతను, యింకా అదే లో స్వరంలో.

కరుణాకరం ఎలాగయినా మంచివాడు; అతనితో మాట్లాడిన సమయం వృథా అయిపోయిందనుకోవటానికి వీల్లేదు - అని గుర్తు తెచ్చుకుంది దమయంతి. వెంటనే అంగీకరించినట్లు కనిపిస్తే బాగుండదని చేతి గడియారం వంక చూచుకుంది. డిజిటల్ వాచ్‌లో పదీ - యిరవైమూడు అయింది.

'పదండి' అంది వెనక్కు తిరిగి.

'నేనింకా అయిదో ఎక్కం చదువుతూ వున్నాను -' అన్నాడు కరుణాకరం, లైబ్రరీ ఆవరణ దాటటం తోటే.

దమయంతికి అర్థం కాలేదు. ఏమిటన్నట్లు చూసింది అతని వంక.

'మీది డిజిటల్ వాచ్. టైం ఎంత అని యిలా చూడడంతోటే అంకెలు కన్పించి చెప్పేస్తాయి. నా గడియారం అలా కాదు. ఇంకా పాతదే. నిమిషాల ముల్లు ఏ అంకె పక్కన ఉందో గమనించి అంకెను అయిదు పెట్టి హెచ్చవేయకపోతే టైం ఎంత అయిందీ తెలిసి చావదు' అన్నాడు.

దమయంతి నవ్వింది. 'డిజిటలిప్పుడు ఓల్డు ఫేషనైపోయింది. అందరూ మళ్లా పెద్ద పెద్ద అంకెలు, గీతలు, విభాగాలు, రోమన్ ఫిగర్స్ ఉన్న గడియారాలు చేతులకు తగిలించుకుంటున్నారు.'

కరుణాకరం సంభాషణ పొడిగించలేదు.

హోటల్లో ప్రవేశించాక, ఓ మారు మూల బల్ల దగ్గర విశ్రాంతిగా కూర్చున్నాక అడిగాడు: 'ఎలా ఉన్నారు? అంతా కులాసాయేనా? ఈ మధ్య ఏమైనా వ్రాస్తున్నారా?'

'అహో! ఏమి రాస్తే ఏం లాభం? మీ బోటివాళ్లు చదవరుగదా!'

'నేను చదవకపోతే పుట్టి మునిగిపోయిందా ఏమిటి? మీరు ఎవరి కోసం వ్రాస్తున్నారో మీ రచన వాళ్లను తప్పకుండా అందుకుంటుంది. ఎవ్విరి బుక్ ఫైండ్స్ ఇట్స్ రీడర్ - అని గదూ ఇంగ్లీషు సూక్తి?'

'అయినా ఎవరు చదివినా చదవకపోయినా వ్రాస్తూ ఉండాలంటారు' అని అడిగింది దమయంతి, ఇంకా అతనినించి తన రచనలు ఎవరో చదువుతున్నారనే పోజిటివ్ రెస్పాన్స్ ఎదురు చూస్తూ.

'వ్రాస్తూ ఉండడం మీ పని. మీ పని మీరు చేస్తూ ఉండండి; మరేమీ ప్రశ్నలు వేయకుండా. కర్మ చేయడం వరకే కదూ మన వంతు. ఆ మధ్య ఎవరో గీత మీద ఉపన్యాసం చేస్తుంటే విన్నాను లెండి, నాకు తెలుసునని కాదు'

దమయంతి నవ్వి ఊరుకుంది.

'ఇంకా యేమిటి చెప్పండి కబుర్లు, ఎప్పుడేనా మన కాలేజికి వెళ్ళారా?'

'ఈ మధ్య లేదు - ' అంది. వాళ్ళిద్దరూ ఒక కాలేజికి పూర్వ విద్యార్థులు. ఆ సంఘానికి ప్రెసిడెంట్‌గానో, కార్యదర్శిగానో వుండమని బలవంతం చేస్తే - టైం లేదని తప్పించుకున్నారు. గౌరవ పోషకులుగా మటుకు వున్నారు.

'దేశం మరీ దారుణం అయిపోతుంది ఈ మధ్య. మరి మీ రచయిత లందరూ యేమయిపోతున్నారు?' అన్నాడు కరుణాకరం.

'మరింత దారుణం కాకుండా చూస్తున్నారనుకుంటాను. అయినా యేమిటి?'

'పల్లెటూళ్ళలో బలం వున్నవాడిదే రాజ్యం. నోరు వున్నవాడితే నాణ్యం.'

'పట్టణాల్లో మటుకు మార్పు వుందంటారా?'

'అదీ నిజమే. దోపిడీలు, దొంగతనాలు, దారుణ హత్యాలు. - వీటికి పల్లె, పట్టణం అనే వ్యత్యాసం లేదు. మనిషి ప్రకృతి, ప్రవృత్తి మారిపోవాలి.'

'కాదండీ. మారిపోనక్కర్లేదు. సహజంగా వున్నది వున్నట్లుగా వుంటే చాలు. మారిపోవడం వల్లనే కృతకత, స్వార్థం పెరుగుతున్నాయి - ' అంది ఆమె.

'అవునండీ. ఒప్పుకున్నాను. ఇద్దరమూ ఒకే విషయం చెబుతున్నాం. పాయింట్ ఆఫ్ వ్యూ వేరు - అంతే!' అని నవ్వేశాడు.

వేడిగా కాఫీ తాగారు యిద్దరూ.

'ఏం చేస్తున్నారు ప్రస్తుతం' అన్నాడు కరుణాకరం.

'సాయంత్రం లోపుగా ఓ కథకు ప్లాట్ తయారుచేయాలి. అందుకోసం తిరుగుతున్నాను. ఈ మధ్యలో -' అంది ఆమె. తను చేస్తున్న పనిలోని ఆనందం తనకు స్పష్టంగా అందుతున్నదన్న భావం మాటలలో స్ఫురింపజేస్తూ.

'కథ వ్రాస్తే యేమిస్తారు మీకు?'

దమయంతి ముందు ఆశ్చర్యపోయింది అతని ప్రశ్నకు. కరుణాకరంలోని డబ్బు మనిషి బయటకు వస్తున్నాడు.

నవ్వేసి వూరుకుంది.

అయినా ఎంతని చెప్పడం? వెయ్యి రూపాయల నుంచి - వంద వరకూ ఎంతయినా కావచ్చును. ఈ రెండు అంకెలకూ పదిరెట్లు వ్యత్యాసం వుండడం నిజమే అయినా కరుణాకరానికి రెండు అంకెలకూ నవ్వువస్తుంది; తప్పదు.

'చెప్పరా?' అన్నాడు కరుణాకరం, నిజంగా తనకు ఆ విషయంలో ఎంతో యింటరెస్ట్ వున్నట్లు.

'ఇంతని చెప్పడం కష్టం. మూడు, నాలుగు వందలు రావచ్చును.' అంది తల పక్కకు, కిందకు దించుకుందామని ప్రయత్నం చేస్తూనే. మాట మార్చడం కోసం 'యీ మధ్య కొత్త ఎల్.పి.లు, కాసెట్‌లు యేం కొన్నారు? ఎవరి సంగీతం వింటున్నారు?' అని అడిగింది.

'ఏం కొనలేదని అడగండి. అఖరుకు - నృత్య సంగీతం తాలూకు రికార్డులు కూడా యిచ్చి వెళ్ళాడు మొన్ననో ఏజెంటు. అదో సరదా. నేను సేకరించుకున్న రికార్డులన్నీ వినటానికయినా నాకు తీరుబాటు వుంటుందో వుండదో - ముందు ముందు.'

అదే దమయంతికి కావలసిన ఎఫెక్ట్.

'ఎప్పుడో వచ్చి వింటాను, అన్నీ'

'తప్పకుండా రండి. యూఆర్ వెల్‌కం' అన్నాడు. మళ్లీ కథల మీదకు మనసు మళ్లిస్తూ కరుణాకరం 'అయితే మీరు సాయంత్రం లోపల ఓ నాలుగు వందల ప్లస్‌లో పడతారన్నమాట!' అన్నాడు.

'నాలుగు వందల కోసం వ్రాస్తున్నాననుకోను. ఇందాక మీరు చెప్పినట్లు, రచన చేయడం లోనే యేదో ఆనందం, తృప్తి... అంతే! డబ్బు యిన్సిడెంటల్' అంది ఆమె.

'ఆ మాట నేను కాదనను. మనిషి యే పని చేసినా తన ఆత్మానందం కోసం చేస్తాడు. డబ్బు కేవలం యిన్సిడెంటల్. అఖరుకు ఫాన్సీ దుకాణంలో ఆ కొట్టువాడు ఆడపిల్లలకు గాజులు, రిబ్బన్లు, బొమ్మలూ అమ్మినా అంతే!' అన్నాడు సిన్సియారిటీ ధ్వనించేట్లు.

దమయంతి 'యితను వేళాకోళం చేయడం లేదు గదా! అయినా డబ్బు మనిషి అని నాకు ముందే తెలుసునుగా! అతని అభిప్రాయాలు యేమయితేనేం?' అనుకుంది.

'నాకో పని చేసి పెట్టండి. అంతకు పదిరెట్లు ముట్టేట్లు చూస్తాను.'

దమయంతి అతని వంక అనుమానంగా చూసింది.

'ఏమిటో చెప్పమంటారా?'

'ఊ -' అని తల ఆడించింది ఆమె.

'మరేం కష్టం లేదు. మీరు ఎలాగూ లైబ్రరీకి వెళతారు యిప్పుడు. అక్కడో గంట సేపయినా కూర్చుంటారు. ఓ గంట తర్వాత నీలి రంగు సూట్‌లో ఒక ఆసామీ మిమ్మల్ని కలుసుకుంటాడు! అతనికి ఓ కవర్ అందించండి, అంతే. మీరు అంగీకరిస్తే ఆ కవర్ యిప్పుడే మీకు యిస్తాను.'

'ఆ కవర్లో యేముంది?'

'నాకు తెలియదు'

'తెలియని పన్లు చేయకపోతేనేం?' అంది ఆమె చిరాకు వ్యక్తం చేస్తూ.

'ప్రశ్నలు వేయడం నా పని కాదు. మీరు చేయనంటే నేనేం అనుకోను. మీ యిష్టం'

'నేనేదన్నా పని చేస్తే దాని పూర్వాపరాలన్నీ నాకు క్షుణ్ణంగా తెలియాలి. దాని వల్ల యే చీమకు, దోమకు కూడా హాని జరగగూడదు.'

'నాకు ఆ పట్టింపు లేమీ లేవు. పనిలో నా భాగం యేమిటో నాకు తెలిస్తే చాలు. అంతగా ఆలోచించకండి. మీరు కథ వ్రాసుకోవటానికి, ఆలోచించుకోవటానికి యేమీ అభ్యంతరంలేదు. ఆ కవరు కోసం మీ దగ్గరకు వచ్చే మనిషి నోరు అయినా మెదపడు. నమస్కారం చేసి వెళ్లిపోతాడు. అంతే!'

'సారీ' అంది దమయంతి, యింకా ఆలోచించవలసింది యేమీ లేదన్నట్లుగా.

'ఈ విషయం మర్చిపోండి' అన్నాడు కరుణాకరం.

ఇద్దరూ రెస్టారెంట్ దాటి యివతలకు వచ్చేసారు. 'అయితే యింక సెలవు తీసుకుంటాను. థాంక్స్ మళ్లీ ఎప్పుడో కలుస్తాను' అన్నాడు కరుణాకరం.

'అలాగే సెలవు. మరేం అనుకోకండి' అంది దమయంతి.

'ఆ సంగతి నేను యిందాకే మరిచి పోయాను. మీరు గుర్తుంచుకుని బాధ పడనవసరం లేదు. బైదిబై – మీ కథల్లో యెక్కడా దీన్ని వాడకండి' అంటూ కరుణాకరం ఆమె దగ్గర వాగ్దానం తీసుకోకుండానే ముందుకు వెళ్ళిపోయాడు.

దమయంతి తన డెస్క్ దగ్గర కూర్చుంది. పుస్తకాల పేజీలు గాలికి రెపరెపలాడుతున్నాయి. ఆమె చేతి వేళ్లకంటే వేగంగా పుటలు ముందుకు నడుస్తున్నాయి.

చుట్టూ - పుస్తకాలు చదువుకుంటున్న చప్పుళ్లు, పుటలు తిరుగబడుతున్న సవ్వడులు తప్ప యింకే శబ్దం లేదు. అప్పుడప్పుడు టెలిఫోన్ మోగుతోంది.

ఎవరో తీస్తారు. బహూనింపాదిగా మాట్లాడుతారు. 'క్లిక్' వినిపిస్తుంది. బయటి గాలి లోపలకు రాదు. మనసులో చోటు చేసుకున్న ఆలోచనలు బయటకు పోవు. బందీ అయిపోతాయి. ఇలా బానిస అయిన భావాలతో చాకచాక్యంగా అక్షరాలు పేర్చడం దమయంతికి అభిరుచి దాయకం అయిన విషయం.

సాయంత్రం - మూడు గంటలు అయేసరికి టీ తాగాలనిపించింది, దమయంతికి. తిలక్ యింటికి వెడితే సరి! ఈ రోజుకు లైబ్రరీలో పడ్డ శ్రమ చాలు, నోట్స్ కాగితాలు పది పన్నెండు పోగు అయినాయి. ఓపిక వుండాలేగాని వీటిని ఆధారంగా చేసుకుని పాతికదాకా కథలు వ్రాసుకోవచ్చును. 'పాయింట్ ఆఫ్ వ్యూ' మార్చుకుంటూ పోతే వంద కథలయినా వ్రాయవచ్చును, దానికేం భాగ్యం. అయినా అంత తీరుబడి, ఓపిక... అవసరం...అన్నీ సమకూరాలి గద.

కడుపులో కొద్దిగా నెప్పి అనిపించింది దమయంతికి, ఎడమ పక్క డొక్కలో.

అదేపనిగా యింతసేపు యీ కొయ్య కుర్చీలో కూర్చున్నందువల్ల యీ మాత్రం నెప్పి చేయడంలో ఆశ్చర్యం లేదు. పైగా పగలు సకాలంలో భోజనం, నిద్ర లేకుండా పోయినాయి. పనిలో పని, యింటికి వెళ్లే దారిలో డాక్టర్‌ను చూచి వెడితే యేదయినా కషాయమో, మాత్రో యిస్తారు. అది వేసుకుని యింటికి చేరి 'టీ' తాగితే అన్నీ సరిపడిపోతాయి. దాన్ని గురించి ప్రత్యేకంగా బెంగపెట్టుకోవలసినదేం లేదు.

దమయంతి డాక్టర్ దగ్గరకు వెళ్లింది.

'అయితే యిప్పటికి తీరుబడి చేసుకున్నారన్న మాట. ఎప్పుడు ఎడ్మిట్ అవుతానంటారు?' అన్నాడు డాక్టర్.

'లేదు డాక్టర్. పక్క వీధిలో యేదో పని వుండి వచ్చాను. ఎలాగూ యింత దూరం వచ్చాను గదా, మిమ్మల్ని చూచి మీ చేత అక్షింతలు వేయించుకుని వెడదామని వచ్చాను. నేనింకా ఆపరేషన్‌కు రెడీ కాలేదు డాక్టర్' అంది దమయంతి.

'చదువుకున్నవాళ్లు. మిమ్మల్ని యెలా కన్విన్స్‌చేయాలో నాకు తెలియడం లేదు. కడుపులో గడ్డ తీసివేయకపోతే ఆరోగ్యానికి చాలా నష్టం. ఎట్లా వచ్చిందో అట్లాగే పోతుంది అనుకుంటున్నారేమో. అలా జరగదు. ఆపరేషన్ చేయవలసిందే -' అన్నాడు డాక్టర్.

'అలాగే ఆపరేషన్ చేద్దురుగాని, డాక్టర్. నేనేం కాదనడం లేదు గదా మీ మాట. ఇంకో మూడు నెలలు టైం యివ్వండి. ఈ లోపల మునిగిపోయేదేం

లేదుగదా. నేను వ్రాయదలుచున్న రెండు నవలలు, అయిదు కథలూ పూర్తి చేసి వేస్తాను. ఇప్పుడవి మధ్యలో వున్నాయి డాక్టర్, క్షమించండి -' అంది దమయంతి.

'అశ్రద్ధకూ ఓ పరిమితి వుందమ్మా. రెండు నెలల క్రితమూ యిదే మాట అన్నావు' అన్నాడు డాక్టర్.

'ఫరవాలేదు డాక్టర్. మీరుండగా మాకేం లోటు. కాస్త కడుపులో గ్యాస్ పేరుకున్నట్లుంది. యేదయినా మందో మాత్రో యివ్వండి - ఈ రోజు మంచి కథ వ్రాయాలని పట్టుదల మీద వున్నాను' అంది దమయంతి. అలా అంటూనే పక్కనున్న పుస్తకాల బీరువా వంక చూసింది. ఆ పుస్తకాలన్నీ తనకు తెలియకుండానే తానే వ్రాసినట్లుగా అనిపించింది దమయంతికి ఒక్క క్షణం పాటు.

✽